# ఉద్యోగం

"మేష్టరుగారికి నమస్కారాలు. మా కొత్తకాపురం బాగానే వుంది. ఇక్కడి సదుపాయాలన్నీ సంతృప్తికరంగా వున్నాయి. మీ అల్లుడుగారుగు చాలా మంచివారే! ఎండకు కందిపోతానేమోననీ, గాలికి వాడిపోతానేమోనని నన్నెంతో సుకుమారంగా చూచుకుంటున్నారు. ఆ మాటకేంగాని, ఈయనలో మాట నిలకడ మాత్రం బొత్తిగా లేదని నేను గట్టిగాచెప్పగలను. పెళ్ళికిముందు ఈయన మన కిచ్చిన మాట మీరు మరచిపోయి వుండరు. మూడు నెలల నుంచీ చూస్తున్నానుగదా, అందునుగురించి లేశమాత్రంనైనా ప్రయత్నిస్తున్న జాడలులేవు. ఎప్పుడైనా అడిగితే, ఒకటే నవ్వు! నాప్రయోజకత్వం చూచావా, నేనెంత సులభంగా మిమ్మల్నందర్నీ బుట్టలో పెట్టగలిగానో గమనించావా అన్నభావం ఆ నవ్వులో ధ్వనించి నాకు చిరాకు కలుగజేస్తూ వుంది. మీరు ఘాటుగా ఒక వుత్తరం రాయాలి. త్వరగా రాస్తారని ఆశిస్తున్నాను. ఇట్లు, మీ ప్రియశిష్యురాలు, కస్తూరి."

నవ్వుటాలకైనా అబద్ధం చెప్పగూడదంటారు. జీవితానికి సంబంధించిన ఒక అతి ముఖ్యమైన, మిక్కిలి కీలకమైన సందర్భంలో ఒక మాటయిచ్చి, పారిపోయిన తర్వాత వెక్కిరించినట్టుగా- ఇచ్చిన మాట తప్పి, కట్టుకున్న భార్యనేగాకుండా, పెళ్ళికి బాధ్యత వహించిన వాళ్ళనికూడా ఎగతాళి పట్టిస్తున్నందుకు నాకు మధుమూర్తిపైన చాలా కోపం వచ్చింది. వేడి వేడిగా నాలుగు చీవాట్లు వడ్డించాలన్న ఉద్దేశంతో కలమూ, కాగితమూ చేతికి తీసుకున్నాను. నాలుగు వాక్యాలు వ్రాశాను గూడా! ఇంతలో ఒక సంగతి గుర్తుకొచ్చింది. ఇది పదిహేను రోజుల్లోనాకెలాగూ హైదరాబాదు వెళ్ళవలసిన పని వుంది. వెయ్యవలసిన నాలుగక్షింతలు అప్పుడు సముఖంలోనే వాడి ముఖంపైన చల్లితేపోలా!

అసలింతకూ ఏం జరిగిందంటే__అది మంచి చెప్పాలిగదా!

* * *

ఆరుమాసాల క్రిందట, ఓ మిట్టమధ్యాన్నపువేళ, తారు రోడ్డుపైన బస్సు దిగి డొంక దారిగుండా అరమైలుదూరం నడిచి ఆమె చక్కా మా వూళ్ళోకి వచ్చేసింది. వాళ్ళ యింటి పాలేరెవడో ఆమెకు తోడుగా వున్నాడు. 'ఏ వూరమ్మాయ్? ఇక్కడెవరింటికి?' అంటూ యెదురైన పల్లెటూరి అమ్మలక్కల పలకరింపులకు వీలయినంత ప్రసన్నంగానే బదులు చెప్పుకుంటూ ఆమె తన గమ్యాన్ని చేరుకోగలిగింది. అప్పుడు నేను యింట్లోనే వున్నాను.

సాహిత్యాన్ని అభిమానించేవాళ్ళు, ఆ రంగంలో యెంతో కొంత కృషి చేసినవాళ్ళు, కొత్తగా ఆ వ్యాసంగంలోకి దిగినవాళ్ళు, పుస్తకాల పబ్లిషర్లు యింకా అలాంటివాళ్లెవరైనా అడపా దడపా నాకోసం వస్తూ వుండడం పరిపాటే! కానీ యిలా ఒక అమ్మాయి రావడానికిదే మొదటిసారి. ప్రాచీన నాటకాల్లో ప్రతీహారి 'యిటు, యిటు' అని దారి చూపినట్టుగా మావూరి పసివాళ్ళు కొందరామెను తోడి తెచ్చి 'యిదే, యిదే' నంటూ మా యింట్లో దిగవిడిచి వెళ్ళిపోయారు.

జంకుగొంకులతో ఒదుగుళ్ళుపోతూ ఆమె "నమస్కారమండీ మేష్టరుగారూ! మాది పెదరామాపురం" అంటూ తనను తాను పరిచయం చేసుకోడానికి ఉపక్రమించింది.

పెదరామాపురమా! తెరపైన బొమ్మలా ఆ ఊరి దృశ్యం నా మనసులో నిలిచింది. మెట్టపొలాలు, గుట్టలు, మామిడితోటలు దాటుతూగానే ఒక కొండవాగు. ఆ వాగు నీటితో నిండే చెరువు. ఆ చెరువుమరవ కల్లంతదూరంలో వుంటుంది పెదరామాపురం. ఆ వూరి రైతుజనానికి మెట్టపంటలే ముఖ్యమైన జీవనాధారం. వాగులో, చెరువులో, బావుల్లో నీళ్ళుండి, మెట్టపొలాలు పచ్చగా వున్న ఆరుమాసాల కాలంలో ఆ వూరు రమణీయమైన ప్రకృతిదృశ్యాల నడమ 'ఊటీ'కి ప్రతిబింబంలా వుంటుంది. జలాశయాల్లో నీళ్ళు వట్టిపోతూ, చేలన్నీ బీళ్ళుగా పడివున్న ఎండాకాలపు రోజుల్లో చెరువుక్రింద మాత్రం పచ్చగా కానవచ్చే వరిపొలాలు ఎదుట ఆ వూరు ఒయాసిస్సులో పల్లెటూరిని తలపిస్తుంది.

పెదరామాపురాన్ని తలచుకుంటే నాకు మొట్టమొదట జ్ఞాపకంవచ్చే వ్యక్తి రాఘవయ్య. వాళ్ళది లంకంత యిల్లు. ఆ ఇంట్లో ఓ మూలగా మాకాపురం. రాఘవయ్య భార్య లక్ష్మమ్మ గూడా దొడ్డ యిల్లాలు. వంటలు వేరైనా కాపురాలు రెండూ కలిసిపోయినట్టే వుండేవి. పాలు, పెరుగు, కూరగాయలు అమ్మి డబ్బుచేసుకునే నాగరికతకు ఆ వూరు చాలా దూరంగా వుండేదప్పుడు. ఇప్పటికీ అలాగే వుండొచ్చు బహుశా!

రాఘవయ్య కిద్దరే బిడ్డలు. కుర్రాడు చిన్నవాడు. అమ్మాయి పెద్దది. నా దగ్గరే నాలుగో, అయిదో చదువుతుండేది. ఆ అమ్మాయి పేరేమిటి? అవునవును. కస్తూరి.

ఈ తలపులన్నీ మనసులో మెదిలి పోవడానికి క్షణంలో సగంసేపు పట్టలేదు. 'అమ్మాయ్! కస్తూరివి గదూ?' అన్నమాట అప్రయత్నంగానే వెలువడింది. నీలికళ్ళతో, బుల్లి ముఖంతోసన్నగా, చిన్నపూలరెమ్మలా వుండిన కస్తూరి యింత పొడుగ్గా, నాజూగ్గా నాగరికురాలుగా ప్రత్యక్షమై పోవడం చూస్తుంటే నా పాలిటికిదంతా గారడీ వాడి కనికట్టు విద్యలాగే వుంది!

ఇంతలో నా ఆశ్చర్యంలో పాలు పంచుకోవడం కోసం పెరటి వైపునుంచి మా ఆవిడగూడా హాల్లోకి వచ్చేసింది.

"ఏమిటండీ! ఏమన్నారు? కస్తూరా! మన రాఘవయ్యగారి కస్తూరి! అమ్మో, ఎలాగో గుర్తు పట్టేశారే! చిన్న పావడాపైన జానెడు జాకెట్టు తొడుక్కుని గొబ్బెమ్మలా ముద్దొస్తుండేదిగదూ! ఇప్పుడైనా వాళ్ళమ్మకు మల్లే పొడుగు దేలిందంతే! కూచోవమ్మా కస్తూరీ! పరవాలేదులే, పెద్దదానివై పోయావుగదా, కుర్చీలోనే కూచో! అమ్మా, నాన్నా బాగున్నారా? తమ్ముడేం చేస్తున్నాడు? అన్నట్టెవరో చెప్పారు, నువ్వు కూడా చదువుకుంటున్నావటగా?"

## మధురాంతకం రాజారాం

"అవునండీ! పోయిన సంవత్సరమే యం. ఏ. ప్యాసయ్యాను...." కుదురుగా కుర్చీలో కూర్చుంటూ అంది కస్తూరి.

"ఏమండీ! ఎం. ఏ. కు మించి చదువు కోడానికింకేమీ వుండదన్నారుగదూ! మరైతే అమ్మాయి ఉన్నచదువంతా పూర్తిగా చదివేసిందన్నమాట!"

"ఆ వివరాలన్నీ తీరిగ్గా తెలుసుకుందువుగానీలే జానకీ! అమ్మాయి యెండలో పడి వచ్చింది. తనకి చల్లగా ఏమైనా యిచ్చేపని చూడగూడదూ? "అన్నాను.

"పది గంటలకు భోజనం చేసే బస్సెక్కాము. ఇప్పుడు మంచినీళ్ళో, మజ్జిగో ఏదిప్పించినా చాలు! అంతకు మించి మీరు తొందరేమి పెట్టుకోకండి!" అంది కస్తూరి.

"ఎందుకమ్మా! ఇంట్లో నిమ్మకాయలున్నాయిలే. షర్బత్ చేసి తీసుకొస్తాను. ఆలోగా నువ్వు మీ మేష్టారుగారితో మాట్లాడుతూ వుండు" అంటూ జానకి లోపలికి వెళ్ళిపోయింది.

వాళ్ళ ఊళ్ళో సేద్యాలను గురించి, వాళ్ళ నాన్నగారి ఆరోగ్యాన్ని గురించి, వాళ్ళ చెరువులో తామర పువ్వుల్ని గురించి యిలా వివిధ విషయాలపైన నేను ప్రసంగాన్ని నడిపించుకొస్తున్నాను. అతిథిపట్ల తనకున్న ప్రేమాభిమానాలకు సూచనగా ఒక చిన్న దేక్సానిండుకూ షర్బత్ కలిపి తీసుకొచ్చింది జానకి. పెద్ద లోటాలో ఏకంగా నాలుగు కాఫీ కప్పులకు సరిపోయే శీతలపానీయాన్ని కస్తూరి ఓపిగ్గా సేవిస్తుండడం చూస్తుంటే అయ్యవారు కోప్పడతారన్న భయంతో తలకు మించిన హోంవర్కుతో సతమతమయ్యే విద్యార్థి దురవస్థ తలపు కొచ్చింది.

ఉండి వుండీ ఆమె తాను వచ్చిన పనేమిటో బయటపెట్టింది. యం.ఏ.లో క్లాసొచ్చిందట. ఇప్పుడు యం.ఫిల్ కోసం పరిశోధన చేస్తోంది. విషయం: ఆధునిక సాహిత్యంలో కుటుంబ జీవితం!

కస్తూరి వైపు చూస్తూ నేను విస్తుపడిపోయాను. ఈతరానివాడు నదిలో దిగడమంటే బహుశా యిలాంటి పనే అయి వుండాలి. తనకంటూ ఒక కాపురం ఏర్పడక ముందే కస్తూరి కుటుంబ జీవితంపైన పరిశోధన చేయవలసిన ఆవశ్యకతకు గురికావడం నా మట్టుకు నాకు విడ్డూరమయిన విషయంగానే తోచింది. అయినా తీరా ఆ విషయాన్ని స్వీకరించి, అందును గురించి యెంతో కొంత ఆసక్తిగూడా కల్పించుకున్న ఈ తరుణంలో ఆమెను నిరుత్సాహపరచడం భావ్యంగా వుండదన్న అభిప్రాయం నా నోటికి తాళం వేసింది.

చిన్న తరగతిలో వున్న రోజుల్లో కస్తూరికి నేను కుటుంబము, దాంపత్యము, జీవితము, సంపాదన మొదలైన పదాల్ని డిక్టేషన్ క్రింద చెప్పివుంటాను. ఇప్పుడవి సూచించే మహదర్థాన్ని గురించి చెప్పడం అంత సులభమేమీ గాదు. పైగా ఆ విషయాలు మన సాహిత్యంలో యెలా చిత్రింపబడి వున్నవీ చెప్పేయాలట! విమానాశ్రయంలో దిగిన నాయకుడ్ని పత్రికా విలేఖరి వేధించినట్టే వుంది. అయినా సరే, నేనేదో త్రవ్వి తలకెత్తుతానని నలభై మైళ్ళ దూరం బస్సు ప్రయాణంచేసి వచ్చిన ప్రియ శిష్యురాలికి ఆశాభంగం యెలా కలిగించగలను?




కుటుంబ జీవితాన్ని ఎదుర్కొంటున్న సమస్యల్ని ఒక్కొక్కటిగా వ్రాసుకుని, ఆయా సమస్యలను ప్రతిబింబించిన రచనల్ని గూడా జాబితా కట్టి ఒకవిధంగా కస్తూరి చిత్తు ప్రతిని రూపొందించుకునేసరికి గంట నాలుగు కావచ్చింది. సాహిత్యంపైన పరిశ్రమించడంవల్లగానీ, దానిపైన పరిశోధన చేయడంవల్లగానీ భౌతికావసరాలు గడి

అవకాశం అట్టే వుండదు. ఈ విషయాన్నీ నాకంటే బాగా గుర్తెరిగిన మా ఆవిడ హాల్లో సాహిత్య చర్చ ముగిసేసరికి ఉపాహారం సిద్ధంచేసి పెట్టింది. వాతావరణంలో నెలకొన్న ఏకాగ్రతవల్ల కలిగిన తలనొప్పిని పోగొట్టడానికి ఆవిడ యిచ్చిన వేడి కాఫీ గూడా అద్భుతంగా పనికొచ్చింది.

ఆయిదుకో, అయిదున్నరకో ఓ బస్సుంది.

ఆ బస్సుకే వెళ్ళితీరాలని పట్టుబట్టింది కస్తూరి.

కస్తూరిని బస్సెక్కించడం కోసం నేను రోడ్డు దగ్గరికి వెళ్ళడం దానంతటది చెప్పుకో దగ్గ గొప్ప విశేషమేమీ గాదు. నాకోసమని మా వూరికి వచ్చిన ప్రతి వ్యక్తి విషయంలోనూ నేనాపాటి మర్యాద పాటిస్తూనే వున్నాను. కానీ కస్తూరిని సాగనంపడం కోసం రోడ్డు దగ్గరికి వెళ్ళినందువల్ల మాత్రం నేనొక పెద్ద చిక్కులో తగులుకున్నాను.

కస్తూరి యెక్కవలసింది చిత్తూరునుంచీ కడపవైపుగా వెళ్ళవలసిన బస్సు. నా గ్రహచారంకొద్దీ ఆ రోజు సాయంకాలం కడప మంచీ చిత్తూరు వైపుగావెళే బస్సుముందుగా వచ్చి రోడ్డుపైన ఆగింది. అందులోనుంచీ సినిమాస్కోప్, ఈస్టమన్ కలర్ చిత్రంలో హీరోలా మా మధుమూర్తి క్రిందికి దిగేశాడు.

ముసిముసి నవ్వులు నవ్వుతూ నా ఎదుటికి వచ్చి నిలబడిపోయినవాడు "పదిహేనురోజుల సెలవులో మా వూరికొచ్చాను మామయ్యా! అందులో ఒకరోజు మీకోసమని కేటాయించాను" అంటూ ప్రారంభించి, ఇంతలో కళ్ళు జిగేల్మనిపించిన దృశ్యమేదో కనిపించినట్టు వివశుడైపోతూ, ఆ దృశ్యానికీ తనకూ మధ్య అడ్డంకులుభరించలేనివాడిలాగ నల్లద్దాల కళ్ళ జోడుగూడా చేతికి తీసేసుకున్నాడు.

ఎబ్బెట్టుతనానికి సహజత పురంగులు పుల మడంకోసం నేను కస్తూరిని వాడికి పరిచయం చేయక తప్పిందిగాదు.

పెదరామాపురమనే వూరు. అక్కడ రాఘవయ్యగారనె స్నేహితుని. కస్తూరి అనే ఈ అమ్మాయి ఒకప్పుడు నాదగ్గర చదువు కోవటం, ఇప్పుడు ఎం. ఏ పూర్తి చేసి రీసెర్చి గూడా చేస్తూ వుండడం....ఈ వివరాలన్నీ వట్టి పొడిమాటలతో చెప్పి ముగించాను.


వాడి పుణ్యమా అని 'సరే మామయ్యా! ఇక నువ్వుండు' అని మాత్రం అనలేదు మా మధుమూర్తి. ఆ అభిప్రాయాన్ని తనే చేతల ద్వారా వ్యక్తం చేశాడు.

ఎదుటి మనిషికి ఊపిరి సలపకుండా ప్రశ్నలే ప్రశ్నలు!

—ఏమండీ, బి. ఏ.లో ఏం గ్రూపు తీసుకున్నారు? యం. ఏ.లో తెలుగెందుకు ప్రిఫెర్ చేశారు? రీసెర్చికోసమని ఏ ఏ లైబ్రరీల కెళ్ళొచ్చారు? గైడు బాగా సహకరిస్తాడు గదండీ? థీసిస్ యింక రెండునెలల్లోనే సబ్‌మిట్ చేసేస్తారా? అన్నట్టు హాస్టల్లోనే గదా మీరుండడం? భోజనం బాగుంటుందా? వెజిటేరియన్నా? నాన్‌వెజిటేరియనా? స్పెషల్స్ తీసుకుంటారా? తీసు కోరులెండి! అలా తినేవాళ్ళయితే యింత బలహీనంగా వుంటారా?....ఇదీ వరస!

నింగికీ నేలకూ మధ్య కస్తూరి అనే మానవాకృతి ఒక్కటి తప్పితే, అంతకు మించిన సృష్టి ఏదో లేనేలేదన్నట్టుగా వుంది మావాడి ధోరణి.

మహానుభావుడు, ఆర్టీసీ బస్సువాడు, అర గంట ఆలస్యంగానైతేనేమి, రానే వచ్చేశాడు. వచ్చి కస్తూరి నెక్కించుకుని తుర్రున పక్షిలా ఎగిరిపోయాడు. ఆ వెళ్ళిపోతున్న బస్సువైపు మావాడు చూచిన చూపులున్నాయి చూశారూ, ఒక మనిషి ఆజన్మశత్రువునైనా అలా చూచివుండడు.




మధుమూర్తి మా ఆవిడకు వేలువిడిచిన మేనల్లుడు. తల్లిదండ్రులకొక్కడే కొడుకు. వాడొక విషయం గురించి పట్టుబడితే అది ఉడుము పట్టే! ఇంజనీరింగులో సీటు దొరక లేదని రెండేళ్ళు చదువు మానేసి యింట్లో కూచున్నాడంతేగానీ, బియెస్సీలో మాత్రం చేరలేదు. ఇంజనీరై రెండేళ్ళయింది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉద్యోగం.


వాడి ధ్యాస విషయాంతరంపైకి మళ్ళించాలని నేనెన్నో విధాలుగా ప్రయత్నించాను. లాభంలేకపోయింది. సందె చీకటిల్లో ఇంటికి తిరిగి వెళ్తుండగా దారిపొడుగునా మళ్ళీ అదే టాపిక్కు.

—"ఏం మామయ్యా! ఆ అమ్మాయి నీదగ్గర చదువుకుందా? నిజంగా?!"

—"మామయ్యా! అప్పట్లో నువ్వా అమ్మాయిని కొట్టేవాడి వనుకుంటాను. ఈ ఎలిమెంటరీస్కూలు టీచర్లు భలేదుర్మార్గులురా బాబూ! ఎంత సుతారపు ప్రాణిమీదనైనా చెయ్యి చేసుకుంటారు."

—"థీసిస్ అంటే వందపేజీలకు తగ్గ కూడదట? మళ్ళీ దాన్ని నాలుగు కాపీలు తియ్యాలిట! పాపం, ఆమె చెయ్యి ఏం కావాలని? ఈ విద్యావిధానం విద్యార్థుల్ని పీల్చి పిప్పి చేస్తోందంటే నమ్ముతావా మామయ్యా?"

'ఒరే నాయనా. కరుణామూర్తీ! నువ్వె




క్కడ దొరికావురా బాబూ నాకు!' అని నేను పైకి అనలేదు. మనసులోనే అనుకున్నాను.

ఆ రోజు రాత్రి భోజనాలైన తర్వాత నా పాటుకు నేను ఏదో పుస్తకం చదువుకుంటూ హాల్లో కూర్చున్నాను. వంటింట్లో అత్తా అల్లుళ్ళ మంతనాలు జోరుగా సాగుతున్న పొలకువ మాత్రం నా చెవిదాకా రాకపోలేదు. శైవ జ్వరం బాణాసురుణ్ణి, వైష్ణవ జ్వరం శ్రీకృష్ణుణ్ణి ఆవహించినట్టు భాగవతంలో చదువుకుంటాము. మా వాణ్ణి ఆవహించిన ప్రేమ జ్వరం ఎంత పనిచేయాలో అంత పనీ చేసింది. ఏ తత్ఫలితం మా ఆవిడ నా దగ్గరికి తీసుకొచ్చిన రాయబారం.

"ఏమిటండీ వీడు! మా రంగనాధ మన్నయ్య రెండేళ్ళ నుంచీ సంబంధాలు చూస్తున్నాడా! వీడికి పగటిపూట పుట్టిన పిల్లా నచ్చిందిగాదు, రాత్రుల్లో పుట్టిన పిల్లా నచ్చలేదు. చూచిన సంబంధాల కన్నింటికీ ఏదో వంకరచెబుతూ వచ్చాడు. ఇప్పుడిదేం కాలానికో రోడ్డుదగ్గర ఆ అమ్మాయిని ఎంత సేపు చూచాడో ఏమిటో, చేసుకుంటే ఆమెనే చేసుకుంటానని హఠం పడుతున్నాడు. ఏమండీ! మనలో మనమాట. ఇందులో రాఘవయ్యగారుగూడా చేదేమీ మేయటంలేదే! కుర్రాడు అందంగా లేడా? బుద్ధిమంతుడు కాడా? ఆ స్తిపాస్తులకు తోడూ విశేషంలాంటి ఉద్యోగంగూడా వుందాయె! మీ ఒకసారి పెదరామాపురం వెళ్ళిరావాలండీ! వనకెందు కులే అనుకోగూడదు. కాయా మనదే, కొడవలీ మనదే! మాటాడరేమండీ! ఈడూజోడూ చూడ ముచ్చటగా వుండదూ?"

మధుమూర్తి కివ్వడానికి తనకొక కూతురు లేకపోయిందన్న కొరత మా ఆవిడ కాదినుంచీ కద్దు! ఆ కొరత తీరిపోయిన సంబరం యిప్పుడామె ముఖంలో దోబూచులాడుతోంది....

పెదరామాపురంలో నేను హఠాత్తుగా వూడిపడేసరికి రాఘవయ్యకు పరమానందమైపోయింది. నేనెంత అక్కరగ్గానైతే ఆయనకోసం వెళానో, ఆయనా అంతే అక్కరగా నాకోసం ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు.

"ఏమయ్యా రామభద్రయ్యా! మేమెంత భద్రంగా వుండేది చూచిపోడానికొచ్చినావా? మంచోడివే నయ్యా! మా అమ్మణ్ణికి నాలుగక్షరం ముక్కలు నేర్పించినావుగానీ, అంతటితో మా దుంప తెంచేసినావయ్యా! హైస్కూల్లో చేర్పించినానా, ప్రతి క్లాసులోనూ ఫస్టుగానే పాసవుతూ వచ్చిందా, సదువుకుంటే తప్పేముందనుకోడమేనయ్యా నేన్చేసిన నేరం! కాలేజీ, కాలేజీ అంటే పోనీలే సదువుకుందువుగానీలే అన్నా. ఒక సమ్మత్సరమో, రెండుసంవత్సరాలోఉండొచ్చేస్తుందనుకుంటే, దీనిల్లు బంగారంగానూ, ఏడేళ్ళదాకా సాగదీసింది. ఇప్పుడదంతా కాదని ఇంకొకటేదో మొదలుపెట్టింది. ఇదెంత కాలం ఈడుస్తుందో మాకేం తెలుస్తుంది? ఎందుకొచ్చిన సదువులయ్యా పాడూ! కాలంలో పెండ్లి చేసివుంటే యిప్పటికి బిడ్డల తల్లయి వుండేదే! ఏమిటోలే, మేము చదువురానోళ్ళం. సదువు లొచ్చును గదా అని మీరు మమ్మల్ని యిలా ముప్పతిప్పలు పెట్టడం న్యాయంగాదు. అందుకే చెబుతున్నా! నువ్వొచ్చావు. ఎలాగైనా అమ్మాయిని పెండ్లికొప్పించే భారం నీది! అంత పనీ చేయకపోయావో, నిన్నిక్కడినుంచే కదలనిచ్చేది లేదు...."

"మీ ఎరుకలో తగిన సంబంధమేదైనా వుందా?" అన్నాను ముందుజాగ్రత్తతో.

"కాదయ్యా! సదువులకోసమని ఈమె యిరవై ఏండ్ల వ్రతంపడితే దగ్గరి సంబంధాలవాళ్ళు కళ్ళల్లో ఒత్తులేసుకుని కాచుక్కూచుంటారా? అవన్నీ దాటిపోయినాయిలే! ఇప్పుడేదైనా కొత్త సమ్మంధమే వెదికి చూడాలి....అలాంటోడు,ఇలాంటోడూ పనికిరాడు గదా! మన అమ్మణ్ణి కన్నా రెండాకులెక్కువగా సదివినోడెక్కడైనా వుంటే చూడు! ఇచ్చి ముడిపెట్టేద్దాం!"

రోగి కోరి వచ్చిన మందునే వైద్యుడను గ్రహించడంకన్నా అదృష్ట మేముంటుంది? నేను వెళ్ళిన పనిగూడా అదేనంటూ తెలియజేసి, వరుణ్ణిగురించిన వివరాలుగూడా ఏకరువు పెట్టాను.

"అయితే యింకేమయ్యా! అమ్మణ్ణి గూడా చూచిందంటున్నావు గనక, యిక మేము అబ్బాయిని చూడాల్సిన పని గూడా లేదు. సమ్మంధం రైటు చేయడం నీ వంతు. నువ్వు చెప్పినట్టుగా పెండ్లి చేసిచ్చే పూచీ నాది."

సరిగ్గా ఈ దశలో యింటి యిల్లాలు జోక్యం చేసుకుంది.

"బాగానేవుందిలేండి! మీలో మీరు ఖరారు చేసుకుంటే అయిపోయిందా! ఆమెగార్ని అడిగి తెలుసుకోనక్కరలేదా? ఇంతకాలం చదువు పూర్తయిపోతేనే పెళ్ళి అంటుండేదా, యిప్పుడు పదం మార్చింది. అన్నగారూ! అదేమిటో మీరే అడిగి తెలుసుకోండి!"

కస్తూరినే అడిగిచూచాను. అబ్బాయి రూపం, చదువు, వుద్యోగం వగైరా హంగులన్నీ ఆమెకు నచ్చినట్టేవున్నాయి. మరైతే ఆమె తన పెళ్ళికోసం పెట్టిన షరతొక్కటే. మొదట వుద్యోగం. తరువాతే పెళ్ళిమాట.

ఇందులో యిక పునరాలోచనకు తావే

లేదని నిష్కర్షగా తేల్చి చెప్పేసింది కస్తూరి.

మాటల్లో కొంచెం కటువుగానే అన్నప్పటికీ చేతల దగ్గరికొచ్చేటప్పటికి కస్తూరి తల్లి దండ్రులు ఆమె అభిమతానికి వ్యతిరేకంగా పూచిక పుల్లనైనా కదిలించలేదని నాకు తెలుసు!

ఊరికి తిరిగివెళ్ళి మధుమూర్తి కొక వుత్తరం వ్రాసి పోస్టుచేశాను. 'పూర్వం పెళ్ళికీ పిచ్చికీ లంకెగలిపి చెబుతుండే వారు. ఇప్పుడు పెళ్ళికీ ఉద్యోగానికీ లంకె గలుపుకో వలసిన పరిస్థితి ఏర్పడినట్టుంది. కస్తూరి తనకు ఉద్యోగం దొరికితేనేగానీ పెళ్ళి చేసుకోదట! నాయనా, ఉద్యోగాలు గగనకుసుమాలు గదా! కస్తూరి ఆశ వదులుకో!'

పదిరోజులదాకా ప్రత్యుత్తరం లేకపోయే సరికి మధుమూర్తి ఆశ వదులుకుని వుంటాడనే అనుకున్నాను. నాది వట్టి భ్రమగానే తేలి పోయింది. చెప్పానుగదండీ మూ వాడిది ఉడుము పట్టని! ఏం వ్రాశాడు? 'మామయ్యా! కస్తూరికిక్కడ ఉద్యోగం సంపాదించిపెట్టడం నాకు చిటికెలో పని! అయితే అందులో ఒక కిటుకుంది. ఎవరికో ఒక అమ్మాయికి ఉద్యోగం కావాలని అడగడంవేరు. స్వంత పెళ్ళానికని అర్థించటంవేరు! రెండో పద్ధతిలో నైతే ఉద్యోగం సంపాదించడం చాలా సులభం! అంతెందుకూ! పదిరూపాయల ముద్రకాగితం పైన అగ్రిమెంటు కావాలన్నా రాసిస్తాను. కస్తూరిని ఉద్యోగినిగా చేసే పూచీ నాది. ఇంతకన్నా ఏం వ్రాయగలను?'

ఈ ఉత్తరం చూపించేటప్పటికి కస్తూరి కాస్త మెత్తబడింది. నెలరోజుల వ్యవధిలోనే పెళ్ళికి ముహూర్తం కుదిరింది.

* * *

హైదరాబాదులో నా పనంతా పూర్తయిన తర్వాత ఒకనాటి సాయంకాలం మధుమూర్తి యింటి చిరునామా మననం చేసుకుంటూ రిక్షా వాణ్ణి విజయనగరం కాలనీలోకి తీసుకెళ్ళ మన్నాను. మావాడు కొన్ని కొండగుర్తులు చెప్పివుంచడంవల్ల యింటిని కనిపెట్టడం సుళువే అయింది. ముచ్చటైన పెంకుటింగులాంటి చిన్నకట్టడం. చుట్టూ పిట్టగోడ. పూల మొక్కలు. యిల్లు చాలాబాగుంది. నేను వెళ్ళే సరికి భార్యాభర్తలిద్దరూ వంటగదిలో కని పించారు. పమిటచెరగు నడుముకు చుట్టుకుని కస్తూరి బాణలిలో ఏదో వేంచుస్తూవుంది. లుంగీపైన బనీను తొడుక్కున్న మధుమూర్తి చాకు చేతబట్టుకుని బంగాళాదుంపల్ని పల్చటి బద్దలుగా తరుగుతున్నాడు.

"సుస్వాగతం మామయ్యా! ఈ వేషంలో నేను 'హెడ్‌కుక్'లా కనిపిస్తూవున్నట్టయితే మన్నించాలి! ఆదివారం గదా! మ్యాట్నీకి వెళ్ళొచ్చాం. ఒక్కతే ఏం చేసుకుంటుందని నేను వంటపనిలో కాస్త సాయంచేస్తున్నా. భార్యను అర్ధాంగి అంటే సరిపోయిందా! సగం పనికూడా పంచుకోవాలి. ఇదంతా ఒక ఆదర్శభర్తగా నన్ను నేను రూపొందించుకునే ప్రయత్నం" అంటూ నాకు సంజాయిషీ చెప్పి 'ఏమంటావు కస్తూరీ?' అంటూ భార్యను ప్రశ్నించాడు మధుమూర్తి.

కస్తూరి అతడివైపు కొరకొర చూపులు చూడడం నేను గమనించాను.

నిమిషాల్లో వంట పూర్తయింది.

"మామయ్యా! నువ్వు మొదట భోజనం చెయ్యాలి. ఆ తర్వాత మేమిద్దరం!"

డైనింగు టేబిలు చిన్నది. మూడోవ్యక్తి కూచుంటే టేబిలుపైన చోటుండదు.

"ఎందుకూ! మీరిద్దరూ భోంచేయండి. నేను వడ్డిస్తాను" అంది కస్తూరి.

"అబ్బె, అదెలా కుదురుతుంది? మామయ్య భోంచేయగా మిగిలింది నీకు సగం, నాకు సగం!" —ఏ పరిస్థితిలోనూ భార్యకన్యాయం జరగడం సహించలేనివాడిలా అన్నాడు మధుమూర్తి.

కస్తూరి మొహంలో ఉక్రోషం చిరచిర లాడుతుండడం నేను గమనించకపోలేదు.

భోజనమైన తర్వాత నేను వాలుకుర్చీలో పడుకున్నాను. వక్కపొడికోసం మధుమూర్తి గదిలోకి వెళ్ళిన అవకాశాన్ని వినియోగించు కుంటూ మెల్లగా నా చెవిలో ఊదేసింది కస్తూరి.

"మేష్టారూ! ఇప్పుడీయన్ను మీరు నిలదీసి అడిగెయ్యాలి. జాబులో వ్రాసిన విషయాలన్నీ గుర్తున్నాయి కదూ? అదిగో, వచ్చేస్తున్నారు...."

అణిచిపెట్టుకున్న కోపమేమో, సమయం దొరకగానే ఒక్కపెట్టున పెల్లుబికి వచ్చేసింది.

"ఒరేయ్ మధుమూర్తీ!" అన్నాను.

ఉలిక్కిపడ్డట్టుగా అటెన్షన్ పోజులో నిల బడిపోయాడు మధుమూర్తి. "ఏం మామయ్యా?" విధేయత ఉట్టిపడుతుండగా ప్రశ్నించాడు.

"పెళ్ళికాగానే అమ్మాయికి వుద్యోగం చూచి పెడతానన్నావు. నీ మాటేమైందని అడుగుతున్నాను."

"అదేమిటి మామయ్యా! నీకింకా తెలి యదా? కస్తూరికెప్పుడో ఉద్యోగం దొరికి పోయింది .... గుంద్రాయిలా అలా బిర్ర బిగుసుకుపోయావేమిటి కస్తూరీ! మీ మేష్టారు గారికి నిజం చెప్పలేదా?.... నిజం మామయ్యా, నెల పుట్టేసరికిప్పుడు ఏడువందల యాభై రూపాయలు కస్తూరి చేతికొస్తున్నాయి ...."

దిగాలు పడిపోతూ బిక్కమొగం పెట్టింది కస్తూరి.

"ఇంతకీ పెద్దగా బరువైన ఉద్యోగం గూడా కాదు. ఇప్పుడు నేనున్నానా! రోజు కెనిమిది గంటలసేపు పని చేస్తున్నాను. కస్తూరి కదేంలేదు. ఎంత యెక్కువనుకున్నా ఆమెకు నాలుగు గంటలకు మించిన పని వుండదు. మిగిలిన సమయంలో పుస్తకాలు చదువుకోవచ్చు. రేడియో వినొచ్చు. పడుకో వచ్చు. ఇంతకంటే హాయైన వుద్యోగం ఎక్కడైనా వుంటుందంటావా మామయ్యా?"

నేనయోమయంగా మధుమూర్తి ముఖం లోకి చూస్తున్నాను. వాడుమాత్రం తన పాటుకు తాను కొనసాగిస్తున్నాడు.

"నేనీమధ్య పనిగట్టుకుని లైబ్రరీలోకి వెళ్ళి నిఘంటువులన్నీ పరిశోధించాను. నువ్వు శబ్దరత్నాకరం చూడు. సూర్యరాయాంధ్ర నిఘంటువు చూడు. ఆంధ్రవాచస్పత్యం చూడు. ఏదైనా 'ఉద్యోగ'మన్న పదానికి 'పని' అనే అర్థం చెబుతుంది. పోనీ, 'చేసే పనికి నెలవారీ ప్రతిఫలం డబ్బురూపంలో ముట్టేపనే ఉద్యోగం' అని నిర్వచనం చెప్పు కుందాం. అప్పుడైనా కస్తూరికి దొరికింది ఉద్యోగం గాకపోదు. పోతే ఆమె ఉద్యోగం పైన 'బాసిజం' వుండదు. ఇన్‌స్పెక్షన్లుం డవు. మంత్‌లీ ప్రోగ్రెస్ పంపుకోవాల్సిన పని వుండదు. చాలనిదానికి షికార్లకు, సినిమాలకు, యింకా ఆమె కోరుకునే వినో దాల కన్నింటికీ యిందులో 'ప్రొవిజన్' వుంటుంది. ఏమంటావు మామయ్యా?"

మావాడి వాదాన్ని బొత్తిగా కొట్టిపార వేయడానికి వీల్లేదనే నాకనిపించింది. కస్తూరి ఏమనుకుంటున్నదో నాకు తెలియదు.